మా కలం.. మీ గళం..

RNI : APTEL/ 2017/74310

# మన గళం

దిన పత్రిక


**వెలిగొండ సొరంగంలో చిక్కుకున్న 200 మంది కార్మికులను కాపాడిన అధికారులు**



2లో..


పబ్లిషర్స్ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ    ఎడిటర్ : నంద కిషోర్    సంపుటి : 08    సంచిక : 130    గురువారం    30 - 10 - 2025    పేజీలు: 8    వెల: 4


# అప్రమత్తంగా ఉండాలి

**- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన మంత్రి ఎన్ డీ ఫరూక్, కలెక్టర్ రాజకుమారి**



మనగళం, నంద్యాల టౌన్ : మొంథా తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ డీ ఫరూక్ సూచించారు. ఈ మేరకు బుధవారం నంద్యాల పట్టణ పరిధిలోని లోతట్టు ప్రాంతాలను మంత్రి, కలెక్టర్ పరిశీలించారు. లోతట్టు ప్రాంతాల తీరును మున్సిపల్ కమిషనర్ శేషన్న మంత్రి, కలెక్టర్ కు వివరించారు. కుందు నది పరివాహక ప్రాంతం (నందమూరి నగర్ వైపు రోడ్), వైయస్సార్ నగర్, పెద్దకొట్టాల, శ్యాం నగర్ చామకాలువ, శ్రమదానం బ్రిడ్జి, ఎస్బీఐ కాలనీ (రామకృష్ణ పీజీ కాలేజ్ సమీపం) వంటి ప్రాంతాల్లో వారు పర్యటించారు. వరద నీటి ప్రవాహం, కాలువల సామర్థ్యం, మరియు నివారణ చర్యలను సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు తమ ప్రాంతాల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి, కలెక్టర్ ల దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా మంత్రి ఎన్.ఎం.డి. ఫరూక్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల సమయంలో ప్రజల భద్రతే ప్రభుత్వా నికి అత్యంత ప్రాధాన్యమ న్నారు. ప్రస్తుతం కుందు నది పరివాహక ప్రాంతా ల్లో నీటి మట్టం పెరుగు తున్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు ఎప్పటికప్పుడు హెచ్చరికలు జారీ చేస్తూ ప్రజలకు సమాచారం అందించాలని ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల్లో అనవసరంగా సంచరించరాదని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేసారు. జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ జిల్లాలో సగటు వర్షపాతం 10 సెంటీమీటర్లు కాగా శ్రీశైలం మండలంలో 26 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైందన్నారు. జిల్లాలో 10 సెంటీమీటర్లకు మించిన వర్షపాతం నమోదైన మండలాలు మొత్తం 10 ఉన్నాయన్నారు.

2 లో..



# మోదీ మంచివాడే... కానీ కఠినమైన వ్యక్తి

**- భారత్-పాక్ అంశంపై డొనాల్డ్ ట్రంప్ స్పందన**

మన గళం, న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీ చూడటానికి ఎంతో మంచి వ్యక్తిలా కనిపిస్తారని, కానీ ఆయన చాలా కఠినమైన వ్యక్తి అని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. బుధవారం తన ఆసియా పర్యటనలో భాగంగా దక్షిణ కొరియాలో మాట్లాడిన ఆయన, భారత్‌తో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వాణిజ్య ఒప్పందంపై త్వరలోనే సంతకాలు చేస్తామని ప్రకటించారు. ఇదే సందర్భంలో భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానని, అందుకు మోదీ కఠిన వైఖరే కారణమని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“భారత్, పాకిస్థాన్‌ల విషయానికొస్తే... నేను భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకుంటున్నాను. నాకు

2 లో..

## గాజులదిన్నె ప్రాజెక్ట్‌ను పరిశీలించిన కలెక్టర్



మనగళం, కర్నూలు సిటీ : గోనెగండ్ల మండలంలోని గాజులదిన్నె ప్రాజెక్ట్ ను బుధవారం ఉదయం కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముందుగా ప్రాజెక్ట్ వద్ద సాగు నీటి సరఫరా పరిస్థితులు, జలాశయం నీటి నిల్వ స్థాయి, సాగు కాల్వల నిర్వహణ పనులు, మరమ్మత్తులు తదితర అంశాల గురించి ఇరిగేషన్ ఎస్ఈ ని అడిగి తెలుసుకున్నారు. 4.5 టీఎంసీ సామర్థ్యం ఉన్న వాటిని 5.5 టీఎంసీ సామర్థ్యం పెంచినందుకు బండ్ ఎత్తు, విస్తీర్ణం పెంచుకుంటూ వెళ్ళారని అందుకు సంబంధించిన పనులు, ఇంకా కొన్ని మరమ్మతుల పనులు నిధులు విడుదల కాక ఆగిపోయాయని ఇరిగేషన్ ఎస్ఈ కలెక్టర్ దృష్టికి తెచ్చారు. స్పందించిన కలెక్టర్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఆదోని ఇంచార్జి ఆర్డీఓ అజయ్, ఇరిగేషన్ ఎస్ఈ బాలచంద్ర రెడ్డి, హెచ్ ఎన్ ఎస్ ఎస్ ఎస్ఈ పాండురంగయ్య, ఇరిగేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లింగ వివక్ష చట్టరీత్యా నేరం




**- బేటీ బచావో - బేటీ పడావో లక్ష్య సాధనకు కృషి**
**- నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి**

మనగళం, కర్నూలు సిటీ : లింగ వివక్ష చట్ట రీత్యా నేరమని, దేశ వ్యాప్తంగా బేటీ బచావో - బేటీ పడావో లక్ష్య సాధన కోసం కృషి జరుగుతుందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. న్యూ ఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్ లో కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జేపీనడ్డా అధ్యక్షతన 31వ కేంద్ర పర్యవేక్షణ మండలి సమావేశం జరిగింది. సమావేశానికి సంబంధించిన వివరాలను ఎంపీ బుధవారం తెలిపారు. లింగ సమానత్వం, మహిళా రక్షణ, గర్భనిర్ధారణకు ముందు, తర్వాత లింగ వివక్ష నిర్మూలన వంటి అంశాలపై చర్చించామని ఈ సందర్భంగా ఎంపీ తెలిపారు. దేశవ్యాప్తంగా “బేటీ బచావో-బేటీ పడావో” లక్ష్యాన్ని సాధించడంలో భాగంగా ఈ సమావేశం ముఖ్యమైన అడుగుగా నిలిచిందన్నారు. యాక్ట్ 1994 అమలు, ప్రగతిపై జేపీనడ్డా సమీక్షించారని ఎంపీ బైరెడ్డి శబరి వివరించారు.

## తుపాను బాధితులకు సీఎం పరామర్శ




**నీట మునిగిన పంట పొలాలను పరిశీలించి రైతులకు ధైర్యం**

మన గళం,కోనసీమ జిల్లా : మొంథా తుపాను కారణంగా తీవ్రంగా నష్టపోయిన అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటించారు. క్షేత్రస్థాయిలో బాధితులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకోవడంతో పాటు, హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే నిర్వహించి నష్టాన్ని అంచనా వేశారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఎవరూ అధైర్యపడొద్దని ఆయన భరోసా ఇచ్చారు. పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి ముందుగా అల్లవరం మండలం ఓడలరేవులో

2 లో..

## మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు

**విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు**
**తుపాను మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం**
**పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం**



మన గళం, అమరావతి : మొంథా తుపాను సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలను, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో ఐదు రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వేగంగా నష్టాన్ని అంచనా వేసేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, తుపాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల ఇబ్బందులను స్వయంగా




## మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి

మన గళం, అమరావతి : మొంథా తుపాను తీరం దాటిన నేపథ్యంలో, ప్రభావిత జిల్లాల్లో సహాయక చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. తుపాను అనంతర పరిస్థితులపై విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో హోంమంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్టీజీఎస్ సెక్రటరీ కాటంనేని భాస్కర్ పాల్గొన్నారు.

2 లో..

## తెలంగాణ మొత్తాన్ని తడిసిముద్ద చేసిన వర్షాలు



- హైదరాబాద్‌లో నీటమునిగిన రహదారులు
- గ్రామీణ ప్రాంతాల్లో తీవ్ర ప్రభావం
- ప్రమాద హెచ్చరికలు, అధికారుల సన్నద్ధత

# మోదీ మంచివాడే... కానీ కఠినమైన వ్యక్తి

ప్రధాని మోదీపై గొప్ప గౌరవం, ప్రేమ ఉన్నాయి. మా మధ్య మంచి సంబంధాలు ఉన్నాయి" అని ట్రంప్ పేర్కొన్నారు. భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు తాను మోదీకి ఫోన్ చేసి, "మీరు పాకిస్థాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే మేం మీతో వాణిజ్య ఒప్పందం చేసుకోలేం" అని చెప్పినట్లు ట్రంప్ గుర్తుచేసుకున్నారు. "మోదీ చూడటానికి మంచి వ్యక్తి అయినా, ఆయన చాలా కఠినమైనవారు. యుద్ధం చేసి తీరుతామన్నారు. అయితే నా మాటలు విన్న రెండు రోజులకే మోదీ, షెరీఫ్ నాతో మాట్లాడి యుద్ధాన్ని ఆపేశారు" అని ట్రంప్ వివరించారు. కొంతకాలంగా ఇరు దేశాల మధ్య వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన నెలకొంది. భారత్ రష్యా నుంచి చమురు కొనడం, అమెరికా భారత ఉత్పత్తులపై అధిక టారిఫ్‌లు విధించడం వంటి అంశాలు చర్చలకు అడ్డంకిగా మారాయి. అయితే ఇటీవల ట్రంప్, మోదీ ఫోన్‌లో మాట్లాడిన తర్వాత ఈ వివాదాలు పరిష్కారమైనట్లు తెలుస్తోంది. అమెరికా టారిఫ్‌లను 16 శాతానికి తగ్గించడానికీ, బదులుగా భారత్ రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించుకోవడానికీ అంగీకరించినట్లు సమాచారం.

# తుపాను బాధితులకు సీఎం చంద్రబాబు పరామర్శ

ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ ఆశ్రయం పొందుతున్న తుపాను బాధితులతో నేరుగా మాట్లాడి వారి యోగక్షేమాలను విచారించారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.3 వేల తక్షణ ఆర్థిక సాయంతో పాటు, 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు తమకు అందాయని బాధితులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి ధైర్యం చెప్పారు. ఈ పర్యటన సందర్భంగా చంద్రబాబు తన కాన్వాయ్ వాహనం నుంచి దిగి ఓ ఇన్నోవా కారులో బాధితులకు వద్దకు వెళ్లారు. నిరాశ్రయులుగా మారిన వారి వద్దకు వెళ్లేందుకు ఆయన ప్రోటోకాల్ ను కూడా పక్కనపెట్టారు. ఈ పర్యటన అనంతరం... అరగట్లపాలెం, బెండమూరులంక గ్రామాలకు వెళ్లి నీట మునిగిన పంట పొలాలను పరిశీలించారు. పొలాల్లోకి దిగి దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి, రైతులతో మాట్లాడారు. తుపాను కారణంగా జరిగిన నష్టం వివరాలను రైతులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వీలైనంత త్వరగా పంట నష్టం అంచనాలను పూర్తి చేసి, బాధితులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. క్షేత్రస్థాయి పర్యటన అనంతరం సీఎం చంద్రబాబు హెలికాప్టర్‌లో ఏరియల్ సర్వే చేపట్టారు. కోనసీమతో పాటు బాపట్ల, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో తుపాను వల్ల జరిగిన పంట నష్టం తీవ్రతను గగనతలం నుంచి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు జారీ చేశారు.

# వెలిగొండ సొరంగంలో చిక్కుకున్న 200 మంది కార్మికులను కాపాడిన అధికారులు



ప్రాజెక్టు రెండో టన్నెల్‌లో చిక్కుకుపోయిన 200 మంది కార్మికులు
కార్మికులను సురక్షితంగా కొల్లం వాగు వద్దకు తరలింపు
అక్కడి నుంచి బోట్ల ద్వారా శ్రీశైలానికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు
అందరూ క్షేమంగా ఉన్నారని తెలిపిన అధికారులు

మన గళం డెస్క్ : ప్రకాశం జిల్లాలోని వెలిగొండ ప్రాజెక్టు సొరంగంలో పెను ప్రమాదం తప్పింది. సొరంగంలో పనులు నిర్వహిస్తున్న సుమారు 200 మంది కార్మికులు ఆకస్మిక వరదలో చిక్కుకోగా, అధికారులు వెంటనే స్పందించి వారిని సురక్షితంగా వెలుపలికి తీసుకొచ్చారు. వివరాల్లోకి వెళితే, పెద్ద దోర్నాల మండలం కొత్తూరు సమీపంలోని వెలిగొండ ప్రాజెక్టు రెండో సొరంగంలో లైనింగ్ పనులు జరుగుతున్నాయి. బుధవారం కార్మికులు విధుల్లో నిమగ్నమై ఉండగా, ఒక్కసారిగా సొరంగంలోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో లోపల ఉన్న 200 మంది కార్మికులు బయటకు వచ్చే మార్గం లేక చిక్కుకుపోయారు. ఈ సమాచారం అందుకున్న ప్రాజెక్టు అధికారులు తక్షణమే సహాయక చర్యలు చేపట్టారు. సొరంగంలో చిక్కుకున్న కార్మికులందరినీ కృష్ణా నది సమీపంలోని కొల్లం వాగు వద్దకు సురక్షితంగా చేర్చారు. వారంతా క్షేమంగా ఉన్నారని వెలిగొండ ప్రాజెక్టు ఈఈ కృష్ణారెడ్డి తెలిపారు. వారిని అక్కడి నుంచి ప్రత్యేక బోట్ల ద్వారా శ్రీశైలానికి తరలించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ ఘటనతో కార్మికుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురైనప్పటికీ, ఎవరికీ ఎలాంటి హాని జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# తెలంగాణ మొత్తాన్ని తడిసిముద్ద చేసిన వర్షాలు



మన గళం, హైదరాబాద్ : మెంథా తుఫాన్ ప్రభావంతో మొత్తం తెలంగాణ రాష్ట్రం వర్షాల ముంపులో కొట్టుకుపోయింది. ఉదయం నుంచే ప్రారంభమైన భారీ వర్షాలు మధ్యాహ్నానికి మరింత తీవ్రతరమయ్యాయి. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబాబాద్, ములుగు, నల్గొండ, రంగారెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో భారీ వర్షపాతం నమోదైంది. రాజధాని హైదరాబాద్‌లో తుఫాన్ ప్రభావం తీవ్రంగా కనిపించింది. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, దిల్‌సుఖ్‌నగర్, ఎర్రమంజిల్, మియాపూర్, కూకట్‌పల్లి ప్రాంతాల్లో రహదారులు నీటమునిగాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొన్ని లోతట్టు ప్రాంతాల్లో నీరు ఇళ్లలోకి చేరి ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో వర్షాలు విస్తారంగా కురిశాయి. చిన్న వాగులు, వంకలు పొంగిపొర్లాయి. పంట పొలాలు నీటమునిగాయి. రైతులు భయాందోళనలో ఉన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి, ఎటూరునాగారం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. తుఫాన్ ప్రభావం కొనసాగనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. రానున్న 24 గంటల్లో వర్షాలు కొనసాగవచ్చని తెలిపింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో అధిక వర్షపాతం ఉండే అవకాశముంది. జిల్లా కలెక్టర్లు అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్ శాఖలు పూర్తి అప్రమత్తంగా ఉన్నాయి.

ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లవద్దని ప్రభుత్వం సూచించింది. చిన్న వాగులు, చెరువుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు. చేపల వేటకు వెళ్లకూడదని, పంటలను రక్షించుకోవడంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారుల సూచన. మెంథా తుఫాన్ ప్రస్తుతం తెలంగాణ మధ్య ప్రాంతాల మీదుగా కదులుతూ ఉత్తర దిశగా పయనిస్తోంది. రాత్రికి దాని ప్రభావం మరింత విస్తరించవచ్చని అంచనా. వాతావరణ పరిస్థితులు చల్లబడడంతో పలు ప్రాంతాల్లో గాలివానలు కూడా నమోదయ్యాయి. మొత్తానికి, మెంథా తుఫాన్ తెలంగాణను వర్షాల రాష్ట్రంగా మార్చేసింది. ప్రభుత్వ యంత్రాంగం సన్నద్ధంగా ఉన్నా, ప్రజలు అప్రమత్తంగా ఉండడం అత్యంత అవసరం.

# అప్రమత్తంగా ఉండాలి

ముఖ్యంగా నంద్యాల, ఆళ్లగడ్డ, ఆత్మకూరు నియోజకవర్గాలు ఈ భారీ వర్షాలకు ఎక్కువగా ప్రభావితమయ్యాయని కలెక్టర్ తెలిపారు. వెలుగోడు రిజర్వాయర్‌కు సరైన పరిపుష్టి లేకపోవడంతో దిగువకు సుమారు 10 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడం వల్ల కుందు నదిలో ప్రవాహం పెరిగిందన్నారు. అయితే నీటిని నియంత్రణలో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకున్నట్లు కలెక్టర్ వివరించారు. నంద్యాల అర్బన్ ప్రాంతంలో మొత్తం ఆరు లోతట్టు ప్రాంతాలు ఉన్నాయని, వాటిలో సుమారు 1,400 కుటుంబాలు నివసిస్తున్నాయని పేర్కొన్నారు. ఎవరి ఇళ్లలోకి నీరు చేరిందో వారిని సమీపంలోని పాఠశాలలు, కమ్యూనిటీ సెంటర్ల పునరావాస కేంద్రాలకు తరలించి వారికి భోజనం, వసతి వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు.

**– రైతులు ఆందోళన చెందొద్దు**

రెవెన్యూ, పోలీసు, మున్సిపల్, పంచాయతీ రాజ్, వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారుల సహకారంతో ఎక్కడైనా అత్యవసర పరిస్థితి ఎదురైతే వెంటనే స్పందించేలా ప్రత్యేక టీములను ఏర్పాటు చేసి పంపిస్తున్నామని కలెక్టర్ రాజకుమారి వివరించారు. అలాగే పంట నష్టం మరియు ఇతర నష్టాల అంచనా వేయడం జరుగుతోందని, గురువారం సాయంత్రం నాటికి పంట పొలాల్లోని నీరు తగ్గిన తర్వాత స్పష్టమైన వివరాలు లభించే అవకాశం ఉందన్నారు. రైతులు ఎవ్వరూ ఆందోళన చెందవద్దని సూచించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మొంథా తుఫాను కారణంగా ప్రతి జిల్లాలో పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని, స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు కూడా అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఎదురయ్యే ఏ సమస్యలనైనా ప్రభుత్వానికి వెంటనే నివేదించడం జరుగుతోందని, ముఖ్యంగా మొక్కజొన్న, వరి, మిరప, ఉల్లి, పూల వంటి



పంటలు వేసిన రైతులకు ప్రభుత్వం నుండి తగిన సహాయం అందించబడుతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అధిక వర్షాల కారణంగా నల్లమల్ల ప్రాంతంలో కురిసిన వర్షాలు 21 వాగుల్లో ప్రవహించి కుందు నదిలో కలిశాయని తెలిపారు. దాంతో బండి ఆత్మకూరు మండలం నారాయణపురం, ఆత్మకూరు మండలంలోని భవనాసి వాగు పొంగిందన్నారు. ఈ నేపథ్యంలో ఆత్మకూరు, బండి ఆత్మకూరు మండలాలు, మహానంది మండలం నందిపల్లి, నంద్యాల అర్బన్ ప్రాంతాల్లో మొత్తం ఆరు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. వర్ష సూచన ప్రస్తుతం లేకపోవడంతో ఉప్పొంగిన వాగులు, రోడ్లమీద ప్రవహిస్తున్న నీరు తగ్గే అవకాశం ఉందన్నారు. శ్రీశైలం, ఆత్మకూరు ప్రాంతాల్లో మాత్రమే వర్ష సూచన ఉన్నదని, మిగతా ప్రాంతాల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు ఈ నెల 31వ తేదీ వరకు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. నంద్యాల మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంటుపల్లి హరిబాబు, నంద్యాల ఆర్డీఓ విశ్వనాథ్ ఇతర అధికారులు వారి వెంట పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు

తెలుసుకున్న ముఖ్యమంత్రి, సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక, పునరుద్ధరణ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అధికారులు తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో సుమారు 87 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా వరి పంట నీట మునిగిందని, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని, 42 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని వివరించారు.

అయితే ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంటనే దెబ్బతిన్న పొలాలను సందర్శించి, పంటలను కాపాడుకునే మార్గాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని నిర్దేశించారు.

# మరో 48 గంటల పాటు అప్రమత్తంగా ఉండాలి

తుపాను నష్టం, సహాయక చర్యలపై లోకేశ్ అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "రాబోయే 48 గంటల పాటు అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని గృహాలు, వాణిజ్య సముదాయాలకు వందశాతం విద్యుత్ సరఫరాను తక్షణమే పునరుద్ధరించాలి. భారీ వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన మట్టి, బురదను తొలగించేందుకు అగ్నిమాపక శాఖ చర్యలు తీసుకోవాలి" అని ఆదేశించారు. పంట నష్టం అంచనాలను వెంటనే రూపొందించాలని, దెబ్బతిన్న పంటలను కాపాడేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని లోకేశ్ సూచించారు. మొంథా తీవ్ర తుపాను కారణంగా సంభవించిన ప్రాణ నష్టం, దెబ్బతిన్న నిర్మాణాలపై పూర్తి నివేదిక అందించాలని కోరారు. వర్షాల ధాటికి దెబ్బతిన్న వంతెనలు, కల్వర్టులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. చెరువులు, కుంటలు, కాలువ గట్లను పటిష్టపరిచేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. "అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. పాముకాటుకు ఉపయోగించే యాంటీ వీనం ఔషధాలను అన్ని ఆసుపత్రుల్లో అందుబాటులో ఉంచాలి. ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. తుపాను బాధితులు, మత్స్యకారులకు అవసరమైన నిత్యావసర సరకులను వెంటనే పంపిణీ చేయాలి" అని లోకేశ్ అధికారులను ఆదేశించారు.



మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక


## అబుబక్కర్ అకాల మరణం తీరని లోటు



మనగళం, కర్నూలు సిటీ : ఆవాజ్ రాష్ట్ర కమిటీ ఉపాధ్యక్షులు అబూబక్కర్ అకాల మరణం ఆవాజ్ ఉద్యమానికి తీరనిలోటని ఆవాజ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఏ సుభాన్ ఆవాజ్ రాష్ట్ర కమిటీ సభ్యులు పి ఇక్బాల్ హుస్సేన్, ఎస్ ఎం డి షరీఫ్ ప్రగాఢ సానుభూతి ని ప్రకటించారు. అబుబక్కర్ మరణ వార్త తీవ్ర దిగ్భ్రాంతి కి గురి చేసిందని వారు తెలియజేశారు. ముస్లిం సమాజానికి ఆయన సేవలు ఎనలేనివి అని కొనియాడారు. ఆయన ఆశయ సాధన కోసం ఆవాజ్ ఎల్లవేళలా ముందుంటుందని, ఆయనకు అల్లా జన్నతుల్ ఫిర్దోస్ ప్రసాదించాలని కోరారు. కుటుంబ సభ్యులకు అల్లాహ్ మనోధర్యం ఇవ్వాలన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన ఎంపీ బస్తిపాటి నాగరాజు

మనగళం, కర్నూలు సిటీ : ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేద ప్రజలకు వరం లాంటిదని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. ఆలూరు మండలం హులేబీడు గ్రామానికి చెందిన గొల్ల నాగన్నకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద మంజూరైన ఆర్థిక సహాయాన్ని ఎంపీ కర్నూలులోని తన కార్యాలయంలో అందజేశారు. నాగన్న అనారోగ్య సమస్యలతో ఓ ప్రైవేట్ ఆసుపత్రి లో చికిత్స పొందాడు. అనంతరం వైద్య ఖర్చుల కోసం ఎంపీ నాగరాజును సంప్రదించి, ఆయన సిఫార్సు తో సీ.ఎం రీలీఫ్ ఫండ్ కి దరఖాస్తు చేసుకోగా రూ.50,431 మంజూరు అయ్యాయి. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందెందుకు సహకారం అందించిన ఎంపీ కి లబ్దిదారుడు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



## భారీ వర్షం...
## తడిసిన పంటపొలాలు



మనగళం, కల్లూరు : మొంథా తుపాను నేపథ్యంలో ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు నీటి మునిగాయి. కల్లూరు మండల పరిధిలోని పర్ల గ్రామంలో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. పంటపొలాలు నీట మునిగాయి. పత్తి పూర్తిగా తడిసి ముద్దయింది. అదేవిధంగా జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ కూలింది.

## అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

**– ఉద్యోగులు అవినీతికి పాల్పడితే ఇబ్బందులు తప్పవ – కర్నూలు డీఆర్ఓ వెంకట నారాయణమ్మ**

మనగళం, కర్నూలు కలెక్టరేట్ : ప్రభుత్వ ఉద్యోగులు అంకితభావంతో విధులు నిర్వర్తించాలని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ సూచించారు. అవినీతికి పాల్పడితే ఎప్పటిట్కనా ఇబ్బందులు, తలవంపులు తప్పవని హెచ్చరించారు. బుధవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో విజిలెన్స్ అవేర్నెస్ వీక్ -2025 కార్యక్రమంలో డీఆర్ఓ ప్రసంగించారు. ఈనెల 31 వ తారీఖున స్వర్గీయ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా రాష్ట్రంలో అవినీతి నివారణ పై ప్రజలకు, ఉద్యోగస్తులకు అవగాహన కార్యక్రమం అక్టోబర్ 29 నుండి నవంబర్ 2 వరకు జరుపుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎంతో కష్టపడి చదివి లక్షల మందితో పోటీపడి పరీక్షలు రాసి సాధించిన ఉద్యోగాన్ని ప్రజల అభివృద్ధి కోసం చేయాలని, మనకున్న ఈ ఉన్నతమైన స్థానాన్ని నిలబెట్టుకోవాలన్నారు. ప్రజలు కట్టే పన్నుల నుండి మనం ప్రతినెల జీతాలు తీసుకుంటున్నామనే విషయాన్ని గుర్తుపెట్టుకుని మసలుకోవాలని సూచించారు. విధులు సక్రమంగా నిర్వహించని అధికారుల గురించి రాష్ట్ర ప్రభుత్వం ఐవీఆర్ ఎస్ ద్వారా ప్రజల నుంచి సేకరించుకుంటుందని హెచ్చరించారు. ఉద్యోగులు సీసీఏ రూల్స్ కు అనుగుణంగా ప్రజలకు, ప్రభుత్వానికి సేవలు అందించాలని తెలిపారు. ఈమధ్య ఉద్యోగస్తులకు కొందరి ఫేక్ ఫోన్ కాల్స్, డిజిటల్ అరెస్ట్ పేరుతో ఫోన్ కాల్స్ వస్తూ ఉన్నావని, వాటికి భయపడకుండా తమ ఉద్యోగ ధర్మాన్ని పాటించాలని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగి తన వద్ద నిబంధనల మేరకు రూ. వెయ్యి కంటే ఎక్కువ నగదు ఉంచుకోరాదని తెలియజేశారు. ఆరోగ్యంగా ఉండటమే మంచి సంపదని, అది గుర్తుంచుకొని ఉన్నదానితోనే సంతోషంతో ఉద్యోగ ధర్మాన్ని నిర్వర్తించాలని కోరారు. అవినీతి నిరోధక శాఖ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ అవినీతి నిరోధక అవగాహన కార్యక్రమం ఒక వారం రోజులు పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాలు 2000 సంవత్సరం నుండి జరుగుతూ ఉన్నవని తెలిపారు. లంచం ఇవ్వడం... తీసుకోవడం




రెండూ నేరమేనని చెప్పారు. ఆ విధంగా చేసిన వారిపై కేసులు ఉంటాయని, కేసు రుజువైతే తీసుకున్న వారు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమాజంలో అట్టడుగు స్థాయికి వెళ్లే అవకాశం ఉంటుందని, అవమానాల పాలు కావలసి ఉంటుందని, కుటుంబ వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందని హెచ్చరించారు. ఉద్యోగి తన వద్ద వెయ్యి రూపాయల కంటే ఎక్కువ నగదు ఉంచుకోరాదని, అలా ఉంటే అవినీతి సొమ్ముగా భావించాల్సి ఉంటుందన్నారు. అవినీతి నిరోధక కేసులు ఐదు రకాలుగా ఉంటాయని ట్రాప్, హౌస్ సర్చ్, అధిక ఆదాయం, నిధులు దుర్వినియోగం, అసెట్స్ కేస్ సర్ప్రైజ్ చెక్ మొదలగు విధానాల ద్వారా అవినీతిని అరికట్టే చర్యలు ఉంటాయని వివరించారు. జిల్లా చిన్నపిల్లల ఆరోగ్య శాఖ అధికారి (డీసీహెచ్ ఎస్) జఫరుల్లా మాట్లాడుతూ అవినీతికి ఉద్యోగస్తులు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ శివరాముడు, కొందరు ఉద్యోగులు తమ అనుభవాలను పంచుకున్నారు. అవినీతి నిరోధక శాఖ ఇన్స్పెక్టర్లు కృష్ణ, రాజా ప్రభాకర్ ఉద్యోగస్తులు పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు.

## పోలీసు క్రీడాకారిణిని అభినందించిన ఎస్పీ

మనగళం, కర్నూలు క్రైం : జమ్ము కాశ్మీర్ రాష్ట్రంలో టెన్త్ ఆల్ ఇండియా పోలీసు జూడో క్లస్టర్ గేమ్స్ లో వెండి, కాంస్యం పతకాలు సాధించిన కర్నూలు ఆర్మడు రిజర్వుడు ఆర్ ఎస్సై పి. కల్పన ను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయం లో ఎస్పీ విక్రాంత్ పాటిల్ అభినందించారు. అక్టోబర్ 8 వ తేదీ నుండి 16 వరకు జమ్మూ అండ్ కాశ్మీర్ రాష్ట్రంలో జరిగిన 10 వ జాతీయ పోలీసు జూడో క్లస్టర్ ఆటల పోటీల్లో ఆంధ్రప్రదేశ్ తరపున కర్నూలు జిల్లా పోలీసుశాఖ నుండి ఆర్ ఎస్సై కల్పన పాల్గొన్నారు. పెన్కాక్ సిలాట్ లో వెండి, కరాటే లో కాంస్య పతకం ఆర్ ఎస్సై కల్పన సాధించారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, జిల్లా పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆకాంక్షించారు.



## ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను అంగీకరించం



మనగళం, కర్నూలు : ప్రభుత్వ వైద్య విద్య చదవాలనుకునే విద్యార్థుల ఆశలను కూటమి ప్రభుత్వం చిద్రం చేస్తుందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసన్నకుమార్ విమర్శించారు. కర్నూల్ నగరంలో సుందరయ్య భవనంలో బుధవారం నిర్వహించిన ముఖ్య నాయకులు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు ప్రైవేటీకరణ చేయడం దుర్మా ర్థమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేటీకరణ వ్యతిరేకంగా భవిష్యత్తులో అందరూ కలిసికట్టుగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కళాశాల పనులను నిలిపివేసి పీపీపీ(పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్షిప్ ) పద్ధతిలో కొనసాగించడానికి క్యాబినెట్ తీర్మానం చేయడం అన్యాయమన్నారు. ప్రైవేటీకరణతో పేదలకు వైద్యం అందే పరిస్థితి ఉండదని, ప్రభుత్వమే వైద్య కళాశాలను నడపాలని డిమాండ్ చేశారు. పీపీపీ విదానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వంలో తీసుకువచ్చిన సెల్ఫైనాన్స్ పద్ధతిపైన తాము అధికారంలోకి వస్తే వంద రోజుల్లో రద్దు చేస్తామని ప్రకటించారని గుర్తు చేశారు. ఈ హామీపైన టీడీపీ నాయకులు ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. వెంటనే కూటమి ప్రభుత్వం వైద్య విద్య ప్రయివేటీకరణ ఆలోచనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సాయి ఉదయ్ , ప్రధాన కార్యదర్శి రంగప్ప, ఉపాధ్యక్షులు శ్రీనివాసులు, అంజి, అబూబకర్ జిల్లా నాయకులు రాము, ఆర్యన్ , కాజా తదితరులు పాల్గొన్నారు.

## జాంబవ సేన ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు

మనగళం, కర్నూలు సిటీ : ఆది జాంబవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నవంబర్ 9వ తేదీన కార్తీక భోజనాలు నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యుడు వేల్పుల గోపాల్ తెలిపారు. ఈ మేరకు బుధవారం కర్నూలు నగర పరిధిలోని వీకర్ సెక్షన్ కాలనీ ఉమామహేశ్వర దేవాలయం కాశీ నుంచి వచ్చిన శ్రీ గురు ధత్తపురి స్వాములతో కార్తీక వన భోజనాల ఏర్పాటుపై ట్రస్ట్ సభ్యులు చర్చించారు. అనంతరం వేల్పుల గోపాల్ మాట్లాడుతూ కార్తీక వన భోజనాలు నవంబర్ 9వ తేదీన ఆదివారం ఉదయం ఏనుమిది గంటలకు శ్రీ ఉమామహేశ్వర దేవాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం వన భోజనాలు ఉంటాయని, హిందూ బంధువులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆది జాంబవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు జానకిరాముడు, వనుమలయ్య, రమేష్, చిన్నపెంచలయ్య, ఆంజనేయులు, పవన్, మద్దిలేటి, పక్కిరయ్య, మోలాలి, భరత్ తదితరులు పాల్గొన్నారు.



## డాక్టర్ గా వైద్య సేవలందించిన ఎంపీ బైరెడ్డి శబరి

**– తోటి విమాన ప్రయాణికురాలుకు ప్రథమ చికిత్స చేసిన ఎంపీ**

మనగళం, కర్నూలు సిటీ : ఢిల్లీ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఇండిగో విమానం నంబర్ 6ఈ 2027 లో మంగళవారం రాత్రి ప్రయాణిస్తున్న ప్రయాణికురాలు సయ్యద్ ఖదీజా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడ్డారు. ఛాతీ నొప్పితో సయ్యద్ ఖదీజా విలపిస్తుంది. అదే విమానంలో ప్రయాణిస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి స్పందించారు. స్వయానా డాక్టర్ అయిన ఎంపీ బైరెడ్డి శబరి సయ్యద్ ఖదీజాకు ప్రాథమిక వైద్య సేవలు అందించారు. బాధితురాలికి వైద్య సేవలు అందజేసిన బైరెడ్డి... ఓదార్చి ధైర్యం చెప్పారు. దీంతో తోటి విమాన ప్రయాణికులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరిని అభినందించారు.



## హోండా నుంచి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ

మనగళం,టోక్యో, అక్టోబర్ 29 : జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ దిగ్గజం హోండా మోటర్ కంపెనీ లిమిటెడ్ తన తొలి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీని ఆవిష్కరించింది. హోండా ఓ ఏ(ఆల్ఫా) పేరుతో విడుదల చేసిన ఈ మాడల్‌ను 2027లో దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్నట్టు ప్రకటించింది. టోక్యోలో జరుగుతున్న జపాన్ మొబిలిటీ షో 2025లో ఈ కారును ప్రదర్శించింది. దేశీయ మార్కెట్లోకి విడుదల చేయనున్న తొలి ఈవీ మాడల్ ఇదే కావడం విశేషం. మహీంద్రా బీఈ 6, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, టాటా కర్వ్ ఈవీ మాడళ్లకు పోటీగా సంస్థ ఈ నూతన మాడల్‌ను ప్రవేశపెట్టబోతున్నది.



# మూడు నెలల చిన్నారికి పెద్ద సమస్య

- గుండె సంబంధిత సమస్యతో బాధపడుతున్న వైనం
- ఆపరేషన్ తప్పదన్న వైద్యులు
- విలపించిన తల్లి ... అండగా నిలిచిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి






మనగళం, కర్నూలు సిటీ : ఓ మూడు నెలల చిన్నారికి పెద్ద సమస్య వచ్చింది. బండి ఆత్మకూరు మండలం ఏ కోడూరు గ్రామానికి చెందిన గజ్జెల మల్లేశ్వరి మూడు నెలల కుమారుడు భూమా యశ్వంత్ రెడ్డి కొన్ని రోజుల నుండి గుండె సంబంధిత వ్యాధితో ఇబ్బంది పడుతున్నాడు. ప్రస్తుతం తిరుపతి శ్రీ పద్మావతి చిల్డ్రన్ హార్ట్ సెంటర్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. తప్పనిసరిగా సర్జరీ (ఆపరేషన్) చేయాలని వైద్యులు చెప్పడంతో ఆర్థిక ఇబ్బందితో బాధపడుతున్న తల్లి గజ్జెల మల్లేశ్వరి విలపించింది. నంద్యాల ఎంపీ, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరికి ఫోన్ చేసి విషయాన్ని వివరించింది గజ్జెల మల్లేశ్వరి. స్పందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వెంటనే ఎల్ఓసీ కోసం లెటర్ ఇచ్చిన ఎంపీ విజయవాడలోని సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆపరేషన్ కు అవసరమైన రూ. 2 లక్షలు మంజూరు చేయించారు. చిన్నారి సమస్యపై వెంటనే స్పందించిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరితోపాటు సీఎం నారా చంద్రబాబుకు తల్లి గజ్జెల మల్లేశ్వరితోపాట కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# వెంకటాపురం తుమ్మలచెరువును పరిశీలించిన అధికారులు








మన గళం డోన్ : మండలం పరిధిలోని జిల్లాలోని అతిపెద్ద చెరువు అయినటువంటివెంకటాపురం తుమ్మలచెరువుకు మెంథా తుఫాన్ ప్రభావంతో చెరువుకు భారీగా చేరుతున్న వర్షం నీరు చెరువు యొక్క నీటిమట్టం ఒక టీఎంసీ కాగా ఇది 25అడుగులు పూర్తిగా నిండినది. ఈ యొక్క చెరువు గత ప్రభుత్వం వారు చెరువు కట్టను రెండు అడుగుల మేరా ఎత్తు పెంచారు. కావున పోలీస్ అధికారు లు, మండల అధికారు లు, ఇరిగేషన్ అధికారులు చెరువు కట్ట చైర్మన్ శ్రీనివాసులు కలిసి పరిశీలించారు. చెరువు కింద ఉన్నటువంటి అబ్బిరెడ్డి పల్లి, వెంకటాపురం, గుమ్మకొండ, అమకతాడు, కర్లకుంట, జగదుర్తి, పుట్లూరు, చెరుకులపాడు తదితర గ్రామాల వారికి తగు జాగ్రత్తలు సూచనలు తెలిపారు. ఇప్పటివరకు చెరువు కట్టకు ఎలాంటి ప్రమాదం లేదు అని అధికారులు, చెరువు కట్ట చైర్మన్ శ్రీనివాసులు మీడియాకుతెలిపారు.

## వర్షాల ప్రభావం తీవ్రం - గ్రామాల్లో సుడిగాలిలా పర్యటించిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్







పెద్దదోర్నాల, మన గళం, అక్టోబర్ 29: ఇటీవల తుపాను ప్రభావంతో నల్లమల్ల అడవి పరిసరాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా పెద్దదోర్నాల మండల పరిధిలోని వై.చర్లపల్లి, చిన్నదోర్నాల, జమ్మిదోర్నాల, కడపరాజుపల్లె గ్రామాల్లో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చెరువులు నిండుకుండలా మారి అలుగులు పొలాల్లోకి చేరడంతో వందల ఎకరాల పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితిని ప్రత్యక్షంగా పరిశీలించేందుకు ఎర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. మొదటగా కర్నూల్%-%గుంటూరు ప్రధాన రహదారిపై దొంగలవాగు ఉధృతిని పరిశీలించి, గంటవానిపల్లి గ్రామం వైపు వెళ్లే రహదారిలో తీగలేరు వాగు ప్రవాహాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ు గంటవానిపల్లి రహదారిపై హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇప్పటికే చర్చలు జరిపినట్లు, త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. గ్రామాల్లో రాకపోకలు స్తంభించిన నేపథ్యంలో ప్రజలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తరువాత ఆయన ఎడవల్లి, కడపరాజుపల్లె, పెద్దబొమ్మలాపురం గ్రామాల్లో పంట పొలాలను పరిశీలించారు. చెరువులు నిండిపోవడంతో చెరువు నీరు పొలాల్లోకి ప్రవహించి పంటలకు నష్టం జరిగినట్లు గమనించారు. పంట నష్ట అంచనాలను అధికారులు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపాలని, రహదారుల పునర్నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో మండల పార్టీ కన్వీనర్ గంట వెంకటరమణారెడ్డి, ఐటీ సెల్ జిల్లా అధ్యక్షుడు దొండేటి నాగేశ్వరరెడ్డి, ఎంపీపీ గుమ్మ పద్మజా, గ్రీవెన్స్ సెల్ కన్వీనర్ వెన్నా వెంకటేశ్వరరెడ్డి, షేక్ షేక్షావలి, దూదేకుల రసూల్, ఒంటేరు నాగేశ్వరరావు, చిట్టే వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కాగ్నిజెంట్ ఆశాజనకం




మన గళం, న్యూఢిల్లీ, అక్టోబర్ 29 : అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్ ఆశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. సెప్టెంబర్ త్రైమాసికానికిగాను కంపెనీ ఆదాయం ఏడాది ప్రాతిపదికన 7.3 శాతం ఎగబాకి 5.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్టు వెల్లడించింది. నాలుగో త్రైమాసికం(అక్టోబర్ నుంచి డిసెంబర్ నాటికి) ఆదాయం 5.27-5.35 బిలియన్ డాలర్ల మధ్యలో నమోదుకావచ్చునని కంపెనీ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. 2022 నుంచి ప్రతిసారి అంచనాలకుమించి రాణిస్తున్నట్టు, ఈ సారి కూడా అంచనాలకు తగ్గట్టుగానే ఆర్థిక ఫలితాలు నమోదయ్యాయన్నారు.

## తుఫాన్ ప్రభావిత ప్రాంతాలలో అన్నదానం..







మన గళం కోవెలకుంట్ల : మొంథా తుఫాను వలన నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పట్టణంలో పలు వీధులు జలమయం కావడం జరిగింది. జలమయం కావడం తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడం గుర్తించి కోవెలకుంట్ల పట్టణానికి చెందిన విక్కీ ఫౌండేషన్ ఫౌండర్ విక్కీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని స్వామి నగర్ ,ఇందిరమ్మ కాలనీలలో ఉదయం,మధ్యాహ్నం,రాత్రి వేళ లలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, సుబ్బారెడ్డి ,కృష్ణారెడ్డి, వినయ్ కుమార్, పోరిమామిళ్ళ సురేష్, ముల్లా దాదా సమీర్ తదితరులు పాల్గొన్నారు. అన్నదాన వితరణ అనంతరం కాలనీవాసులు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# మళ్లీ పెరిగిన పుత్తడి

## - రూ.2,600 ఎగసిన తులం విలువ



మన గళం, న్యూఢిల్లీ, అక్టోబర్ 29 : గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన పుత్తడి మళ్లీ ప్రియమైంది. అమెరికా ఫెడరల్ రిజర్వు వడ్డీరేట్లను పావు శాతం తగ్గించే అవకాశాలుండటంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు భారీగా పుంజుకున్నాయి. ఇదే క్రమంలో దేశ రాజధాని న్యూఢిల్లీలో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల బంగారం ధర రూ.2,600 ఎగబాకి రూ.1,24,400 పలికింది. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన గోల్డ్ ధర కూడా అంతే స్థాయిలో ఎగబాకి రూ.1,23,800కి చేరుకున్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం బంగారం ధర రూ.1,580 అధిమై రూ.1,22,400కి చేరుకోగా, 22 క్యారెట్ ధర కూడా అంతే స్థాయిలో అధికమై రూ.1,12,200 పలికింది. బంగారంతోపాటు వెండి కూడా పరుగులు పెట్టింది. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.6,700 ఎగబాకి రూ.1,51,700కి చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లోనూ కిలో వెండి రూ.1,000 ఎగబాకి రూ.1.66 లక్షలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 4 వేల డాలర్ల పైకి చేరుకోవడంతో దేశీయంగా ధరలు భారీగా పుంజుకున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. గత మూడు రోజులుగా తగ్గుతూ వచ్చిన గోల్డ్ ధరలు గ్లోబల్ మార్కెట్లో ఒక్కసారిగా భారీగా పుంజుకున్నాయి. ఔన్స్ గోల్డ్ ఏకంగా 77 డాలర్లు పెరిగి 4,029 డాలర్లకు చేరుకోడా, వెండి 48.40 డాలర్ల వద్ద ట్రేడవుతున్నది.



మా కలం.. మీ గళం..
మనగళం
దిన పత్రిక

# సంపాదకీయం

రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ వ్యతిరేకతలు
– ప్రజాస్వామ్యానికి నష్టం లేదా బలం?

రాష్ట్ర రాజకీయ వాతావరణం ఇటీవలి నెలలుగా వేడెక్కుతోంది. ప్రతి విధానంపై, ప్రతి నిర్ణయంపై ప్రజలు, ప్రతిపక్షాలు, సామాజిక వర్గాలు తీవ్ర స్పందన వ్యక్తం చేస్తున్నాయి. ఇది ఒకపక్క ప్రజాస్వామ్య చైతన్యానికి సూచనగా కనిపిస్తే, మరోపక్క ఈ వాదోపవాదాలు హద్దులు దాటితే పాలనలో అస్థిరత, ప్రజల్లో విభజన, అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం కూడా ఉంది. ప్రజాస్వామ్యంలో వ్యతిరేకతలు సహజం కానీ, అవి ఆరోగ్యకరంగా కొనసాగడమే ముఖ్యమని నిపుణులు చెబుతున్నారు. ప్రజాస్వామ్యం అంటే కేవలం ఐదు సంవత్సరాలకు ఒకసారి ఓటు వేయడం కాదుబీ అది ప్రతి రోజూ ప్రజలు తమ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా వ్యక్తం చేయగలగడం. ప్రజలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం, ప్రశ్నించడం, బాధ్యతను కోరడం ు ఇవే ప్రజాస్వామ్య ప్రాణం. ఈ దిశలో చూస్తే, రాష్ట్రంలో పెరుగుతున్న రాజకీయ వ్యతిరేకతలను ప్రజల చైతన్యానికి సంకేతంగా పరిగణించవచ్చు. కాని, ఆ వ్యతిరేకతలు వ్యక్తిగత ద్వేషానికి, రాజకీయ లాభ నష్టాల క్రీడలకు వేదికగా మారితే మాత్రం వ్యవస్థపై విశ్వాసం దెబ్బతింటుంది.

ఇటీవలి కాలంలో పలు ప్రభుత్వ నిర్ణయాలు సంక్షేమ పథకాలు, భూసంస్కరణలు, నియామక విధానాలు, ప్రాజెక్టుల కేటాయింపులు అన్నీ ప్రజా చర్చకు దారితీశాయి. ప్రతిపక్ష పార్టీలు వీటిని రాజకీయ ఆయుధాలుగా ఉపయోగిస్తుండగా, ప్రభుత్వం కూడా తమ వైపు ఉన్న సానుకూల అంశాలను ప్రచారం చేస్తోంది. ఈ పరిస్థితి సాధారణంగా కనిపించినప్పటికీ, దాని వెనుక ఒక పెద్ద ప్రశ్న ఉంది: ఈ విభేదాలు ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తున్నాయా? లేక విభజనాత్మక వాతావరణాన్ని పెంచుతున్నాయా? పాలనలో పారదర్శకత కోసం వ్యతిరేకతలు అవసరం. ప్రతిపక్షం ఉన్నత ప్రమాణాలతో ప్రశ్నించాలి, ప్రభుత్వం సమాధానం ఇవ్వాలి. ఇదే ప్రజాస్వామ్య ధర్మం. ఉదాహరణకు, ఒక పథకం అమలులో లోపాలుంటే దానిని బయటపెట్టడం ప్రజలకు మేలు చేస్తుంది. కానీ, అదే విషయాన్ని రాజకీయ లాభం కోసం వక్రీకరించడం ప్రజల్లో గందరగోళం సృష్టిస్తుంది. ఈ తేడాను అర్థం చేసుకునే పరిపక్వతే ప్రజాస్వామ్యానికి బలం.

ఇంకా ఒక ప్రధాన అంశం  ప్రజల పాత్ర. ప్రజలు ఏ విధమైన సమాచారం వింటే వెంటనే నమ్మకూడదు. ప్రతి రాజకీయ ప్రకటన వెనుక ఉన్న ఉద్దేశ్యాన్ని తెలుసుకోవాలి. సోషల్ మీడియా యుగంలో ప్రతి వ్యాఖ్య, ప్రతి వీడియో ఒక అభిప్రాయం కాకుండా, ఒక అజెండాగా మారిపోతోంది. ఈ సందర్భంలో ప్రజలు వివేకంతో, వివేచనతో స్పందిస్తేనే రాజకీయ వాతావరణం సంతులితంగా ఉంటుంది. ప్రతిపక్షాల దృష్టికోణం కూడా మారాలి. కేవలం ప్రభుత్వాన్ని విమర్శించడం కాదుబీ ప్రజలకు ప్రత్యామ్నాయ విధానాలను చూపడం, నిర్మాణాత్మక విమర్శలు చేయడం అవసరం. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం బలహీనమైతే ప్రభుత్వం కూడా నిర్లక్ష్యానికి లోనవుతుంది. అందుకే సజీవమైన ప్రతిపక్షం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి గుర్తు.

అదేవిధంగా, ప్రభుత్వం కూడా వ్యతిరేక స్వరాలను అణగదీయడం కన్నా వాటిని విన్నపంగా స్వీకరించాలి. ప్రజలలో ఉన్న అసంతృప్తిని అర్థం చేసుకోవడం, సమస్యలకు స్పందించడం పాలనలో బాధ్యత. పాలక వర్గం విమర్శలను శత్రుత్వంగా చూడకుండా, వాటిని ప్రజా అభిప్రాయం ప్రతిబింబంగా గుర్తిస్తే పాలన స్థిరంగా ఉంటుంది.

ఇక చివరగా, ప్రజాస్వామ్యం బలంగా నిలవాలంటే చర్చా సంస్కృతి, సహనశక్తి, పరస్పర గౌరవం పెరగాలి. రాజకీయ విభేదాలు తప్పనిసరిగా ఉంటాయి, కాని అవి అభివృద్ధికి అడ్డుకాదని గుర్తించాలి. ప్రజల ప్రయోజనమే ప్రధాన లక్ష్యంగా ఉన్నంతవరకు వ్యతిరేకతలన్నీ ప్రజాస్వామ్యానికి బలం అవుతాయి. అదే మన వ్యవస్థను బలపరచే మార్గం.

**– విశ్లేషణ : మునిగాల రాజు పాత్రికేయులు,**
**డిజైనర్ టెక్ గురు. 8897975262**

## భాస్కర్ రెడ్డి. రజకుల కాలనీకి సిసి రోడ్డు మురికి కాలువలు ఏర్పాటు చేయాలి..సిపిఐ





మనగళం, కోడుమూరు : కోడుమూరు పట్టణ సమీపంలోని భాస్కర్ రెడ్డి. మరియు రజకుల కాలనీకి సిసి రోడ్డు మురికినీటి కాలువలను ఏర్పాటు చేయాలని సిపిఐ మండల కార్యదర్శి బి రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కోడుమూరు పట్టణంలోని భాస్కర్ రెడ్డి కాలనీ వాసులతో సిపిఐ బృందం మురికినీటి కాలువలను పరిశీలించడం జరిగింది . ఈ సందర్భంగా సిపిఐ పార్టీ మండల కార్యదర్శి బి రాజు ఏఐటియుసి తాలూకా కార్యదర్శి మద్దూరు చిన్న రాముడు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాల నుంచి భాస్కర్ రెడ్డి కాలనీవాసులు సిసి రోడ్లు లేక మురుకునీటి కాలువలలో అనారోగ్యాలకు గురవుతూ ప్రజలకు విష జ్వరాలు డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వస్తాయని రోడ్డు లేక ఇరువైపులా కంప చెట్లు ఉండటం వలన పాములు తేళ్లు వంటి విష పురుగులు తిరుగుతూ ఉంటాయి . కాబట్టి కాలనీకి సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని వారన్నారు ఇప్పటికైనా కనీసం మండలంలో ఉన్న అధికారులు కాలనీవాసుల పట్ల కనికరం చూపించి ఈ కాలనీ వాసులకు సీసీ రోడ్డు మురుగునీటి కాలవలను వెయ్యాలని వారు డిమాండ్ చేశారు లేని పక్షంలో సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు మద్దిలేటి కాలనీ ప్రజలు లక్ష్మీదేవి సుంకులమ్మ రాజు తదితరులు పాల్గొన్నారు

## మోంథా తుఫాను తో కురిసిన వర్షాలకు ప్రతి కంది వేరుశనగ మొదలగు పంటల రక్షణకై రైతులకు అవగాహన సదస్సు





మన గళం కోడుమూరు: కర్నూలు జిల్లా కోడుమూరు మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో మోంథా తుఫాను తో కురిసిన వర్షాలకు ప్రతి కంది వేరుశనగ మొదలగు పంటల పైన రైతులు తీసుకోవలసినటువంటి జాగ్రత్తలను తెలుపుట కొరకు జిల్లా శిక్షణ కేంద్రం నుంచి %ాణాూ% శ్రీ యస్ వెంకటేశ్వర్లు మరియు ఏవో వెంకట రంగారెడ్డి మరియు మండల వ్యవసాయ అధికారి రవి ప్రకాష్ మరియు రైతు సేవ కేంద్రం సిబ్బంది రైతులందరికీ ఈ సందర్భంగా ఆవాహన కల్పించారు రైతులందరికీ తగు సూచనలు సలహాలు అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిశ్రమ పంటల సాగు విధానం ద్వారా ఇలాంటి తుఫానుల నుండి రైతులు నష్టపోకుండా ఉంటారని తెలియజేశారు అలాగే కందిలో మల్టీకే న్స్రే ఎకరాకు కేజీ చొప్పున చేసుకున్న ఎడల పూతరాలటను అరికట్టవచ్చు వారు అన్నారు కందిలో గూడు పురుగు నివారణ కోసం %ణవశ్రీఖఎవ్ప్తతీఱ౹% ఎకరాకు 100 స్రే చేసుకోవాలి అలాగే నీటి ఆధారంగా సాగుచేసిన వేరుశనగలు పచ్చపురుగులద్ద పురుగు నివారించుట కొరకు %చీబజశీశ్రీబతీశీఅం×అఱఆఎషశీతీఎ% మందులను స్రే చేయాలి. మరియు జిప్సం ఎకరాకు 200 కేజీలు వాడుకోవాలని రైతులకు వారు తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మరియు సిబ్బంది స్థానిక రైతులు పాల్గొన్నారు.

## పంట కోతలు వాయిదా వేసుకోండి.. వ్యవసాయ అధికారి జ్యోతి







మన గళం సంజామల : నంద్యాల జిల్లా కోవెలకుంట్ల మండల పరిధిలోని ముదిగేడు గ్రామంలో మొంథా తుఫాను ప్రభావం వలన కోతకు వచ్చిన పంట పొలాలను వాయిదా వేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి, వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్ , ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా శాస్త్రవేత్తలు రవి ప్రకాష్ , కవిత , రమాదేవి , మండల వ్యవసాయ అధికారి బి జ్యోతి బుధవారం అన్నారు. మొంథా

అరిన్ఎబ,తుఫాను ప్రభావిత పొలాల్లో ఏ జాగ్రత్త తీసుకోవాలని రైతులకు సూచించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి మద్దిలేటి మాట్లాడుతూ పొలాల్లో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలబడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలి అని, మొక్కజొన్న వంటి పంట కోతలు వర్షాలు తగ్గేంత వరకు వాయిదా వేసుకోవాలని, పంట కోతలు చేసినట్లయితే ధాన్యం మొలకెత్తకుండా ఉప్పు ద్రావణం పిచికారి చేసుకోవాలని, దాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు రైతులకు తెలియజేశారు.

అనంతరం శాస్త్రవేత్తలు మాట్లాడుతూ వర్షం తగ్గిన తర్వాత వరి పొలాల్లో 25 కేజీ యూరియా, 25 కేజీ పోటాష్ ఎరువులను చల్లుకోవాలని, అధిక వర్షాల కారణంగా వరిలో ముఖ్యంగా వచ్చే మాని పండు తెగులకి ప్రొపైకానాజోలు, అగ్గి తెగులుగాను ట్రైసైక్లోజోలు 0.6 గ్రామ్స్ /లీటర్ నీటి కలిపి రసాయనాన్ని పిచికారి చేసుకోవాలని తెగులు సోకకుండా తగు జాగ్రత్త తీసుకోవాలని తెలియజేశారు. తరువాత వేయబోయే శనగ పంటకు ఎండు తెగులు సోకకుండా ట్రైకోడెర్మావిరిడి తో విత్తన శు ద్ధి చేసుకుని విత్తుకోవాల్సిందిగా తెలియజేశారు.గ్రామంలోని వరద నీటి ముంపుకు గురి అయినా వరి పొలాలను సందర్శించడం జరిగింది. వరి పొలాలలో ఆకు ముడత పురుగు ఎక్కువ ఉన్న కారణంగా కార్టాప్ హైడ్రోక్లోరైడర్ గుళికలు చలుకొని పంట పురుగుల నుండి రక్షించు కోవాలని తెలియచేసారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకాంత్, సుమపరిమళ మరియు రైతులు పాల్గొన్నారు.

## త్వరలో టాటా టూవీలర్లు?




మన గళంన్యూఢిల్లీ, అక్టోబర్ 29 : దేశీయ ఆటో రంగ దిగ్గజం టాటా మోటర్స్.. ద్విచక్ర వాహనాల తయారీలోకి రాబోతున్నదని, సంప్రదాయ బైకులతోపాటు విద్యుత్తు ఆధారిత (ఈవీ) టూవీలర్లను మార్కెట్‌కు పరిచయం చేయబోతున్నదన్న వార్తలు బుధవారం పలు సోషల్ మీడియా వేదికల్లో హల్‌చల్ చేశాయి. ఇప్పటికే భారీ, మధ్యశ్రేణి, తేలికపాటి వాణిజ్య వాహనాలు, ప్యాసింజర్ కార్ల తయారీలో దూసుకుపోతున్న టాటా మోటర్స్.. ఇక టూవీలర్ సెగ్మెంట్‌లోకి ప్రవేశించబోతున్నదని, ఈ క్రమంలోనే ముందుగా 110సీసీ, 125సీసీ బైకులను అందుబాటులోకి తేనుందని జోరుగా ప్రచారం జరుగుతున్నది. 110సీసీ బైక్ ధర రూ.45,999గా, 125సీసీ బైక్ ధర రూ.55,999గా ఉండొచ్చన్న అంచనాలూ వినిపిస్తుండటం గమనార్హం. ఇవి లీటర్ పెట్రోల్‌కు 90 కిలోమీటర్ల మైలేజీ ఇస్తాయనీ అంటున్నారు. అలాగే సింగిల్ చార్జింగ్‌పై 280 కిలోమీటర్లు ప్రయాణించేలా టాటా బ్రాండ్ ఎలక్ట్రిక్ టూవీలర్లూ వస్తాయని చెప్తుండటం విశేషం. అయితే వీటి ధర కేవలం రూ.85,000గానే ఉండొచ్చని ఆయా వెబ్‌సైట్లు పేర్కొంటున్నాయి. కాగా, హీరో మోటోకార్ప్, హోండా మోటర్‌సైకిల్, బజాజ్, టీవీఎస్‌లకు పోటీగా వచ్చే ఏడాది ఇవి దేశీయ మార్కెట్‌లోకి ఎంట్రీ ఇస్తాయని అంచనా.

# శ్రీ సాక్షిగణపతిస్వామికి విశేష అభిషేకం


మనగళం శ్రీశైలం : లోక కల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (29.10.2025) ఉదయం సాక్షిగణపతిస్వామి వారికి విశేష అభిషేకాన్ని నిర్వహించింది. కాగా ప్రతి బుధవారం, సంకటహరచవితిరోజులు మరియు పౌర్ణమిరోజులలో శ్రీసాక్షిగణపతి వారికి ఈ విశేషఅభిషేకం మరియు పూజాదికాలు దేవస్థానంసేవగా (సర్కారిసేవగా) నిర్వహించబడుతున్నాయి. ఈ ఉదయం సాక్షిగణపతిస్వామివారికి పంచామృతాలతోనూ, పలుఫలోదకాలతోనూ, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకం నిర్వహించబడింది. తరువాత స్వామివారికి విశేషపుష్పార్చన, నివేదన కార్యక్రమాలు జరిపించబడ్డాయి. వైదిక సంప్రదాయాలలో గణపతి అభిషేకానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఈ గణపతి అభిషేకం వలన అనుకున్న పనులలో ఆటంకాలు తొలగి విజయం లభిస్తుందని చెప్పబడుతోంది. అలాగే కోరిన కోరికలు నెరవేరుతాయని, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలుగుతాయని, ముఖ్యంగా విద్యార్థులలో ఆలోచనా శక్తి పెరిగి విద్య బాగా వస్తుందని చెప్పబడుతోంది కాగా శ్రీశైలక్షేత్ర పరివార ఆలయాలలో సాక్షిగణపతి ఆలయానికి ఎంతో విశిష్టత ఉంది. భక్తులు శ్రీశైల మహాక్షేత్రాన్ని సందర్శించినట్లుగా కైలాసంలో పరమేశ్వరుని



వద్ద ఈ స్వామి సాక్ష్యం చెబుతాడని ప్రసిద్ధి. అందుకే ఈ స్వామి సాక్షిగణపతిగా పేరొందాడు. చక్కని నల్లరాతితో మలచబడిన ఈ స్వామి ఒకచేతిలో కలం, మరోచేతిలో పుస్తకాన్ని ధరించి భక్తుల పేర్లను నమోదు చేస్తున్నట్లుగా దర్శనమిస్తాడు.

# ఆలయప్రాంగణములోని వీరభద్రస్వామికి విశేష పూజలు

మనగళం శ్రీశైలం : లోకకల్యాణం కోసం దేవస్థానం ఈ రోజు (29.10.2025) సాయంకాలం ఆలయ ప్రాంగణం లోని వీరభద్రస్వామివారికి (జ్వాలావీరభద్రస్వామివారికి) విశేషపూజలను నిర్వహిస్తోంది. ఆలయప్రాంగణంలో మల్లికార్జునస్వామివారి ఆలయానికి ఉత్తరభాగంలో మల్లికాగుండానికి ప్రక్కనే ఉన్న వీరభద్రస్వామి జ్వాలామకుటంతో పదిచేతులతో విశిష్టరూపంల దర్శనమిస్తాడు. శిల్పశాస్త్ర పరిభాషలో ఈ స్వామికి అఘోరవీరభద్రమూర్తి అని పేరు కూడా ఉంది. స్వామివారికి ప్రక్కనే దక్షప్రజాపతి కనిపిస్తాడు. ఈ స్వామిని పరివార ఆలయాలలో భాగంగా ప్రతినిత్యం పూజించడం జరుగుతోంది. కాగా ప్రతి బుధవారం ప్రదోషకాలంలో విశేషఅభిషేకం కార్యక్రమం దేవస్థానం నిర్వహిస్తోంది. ఈ పూజవలన లోకశాంతి, దుర్భిక్షనివారణ, భక్తుల అనుకున్న కోరికలు నెరవేరుతాయి. ముఖ్యంగా క్షేత్ర అభివృద్ధి జరుగుతుంది. కాగా ఈ పూజలలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతిపూజను నిర్వహించబడుతుంది. తరువాత వీరభద్రస్వామికి పంచామృతాలతోనూ, పలురకాల ఫలోదకాలతోనూ, గంధోదకం, భస్మోదకం, పుష్పోదకం, బిల్వోదకం, హరిద్రోదకంతోనూ మరియు మల్లికా గుండంలోని శుద్ధజలంతో విశేష అభిషేకం



నిర్వహించడం జరుగుతుంది. ఈ అభిషేకాల తరువాత విశేషంగా స్వామివారికి పుష్పార్చనను జరిపించబడుతుంది.

# మొంథా తుఫాన్ శ్రీశైలం లో చిక్కుకున్న ప్రజలకు దేవస్థానం వారిచే అన్నప్రసాద వితరణ





మనగళం శ్రీశైలం : మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలు పడుతుండడంతో ఈ ( 29.10.2025) ఉదయం శ్రీశైలానికి వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా దేవస్థానం భక్తులకు శిఖరేశ్వరం, బస్టాండులలో అన్నప్రసాదాలను అందజేస్తోంది. ఈ రోజు (29.10.2025) ఉదయం కార్యనిర్వహణాధికారి వారు శ్రీ యం.శ్రీనివాసరావు, శిఖరేశ్వరం వద్ద ఈ అన్నప్రసాద పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి వారు మాట్లాడుతూ మొంథా తుఫాన్ కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు పడుతున్నాయన్నారు. ముందుజాగ్రత్తచర్యలలో భాగంగా అధికారులు శ్రీశైలానికి వాహనాల రాకపోకలను నిలిపివేయడం జరిగిందన్నారు. ఈ కారణంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఉండేందుకు శిఖరేశ్వరం మరియు బస్టాండులలో అన్నప్రసాదాలు అందజేస్తున్నామన్నారు. ఈ మధ్యాహ్నం నుంచి బిస్కెట్లను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. అదేవిధంగా యాత్రికులందరు కూడా అధికారుల సూచనల మేరకు సమయానుసారంగా వారి ప్రయాణాలను సాగించి క్షేమంగా వారి గమ్యస్థానాలకు చేరాలని సూచించారు. ఈ అన్నప్రసాద వితరణలో ఉదయం పులిహోరతో పాటు అల్పాహారంగా ఉప్మా కూడా అందజేయబడింది. అదేవిధంగా మధ్యాహ్నం సాంబారన్నం,పెరుగన్నం అందజేయబడుతున్నాయి.

# జాయింట్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలి




మనగళం, నంద్యాల : చిత్తూరు జిల్లా వాణిజ్య పన్నుల శాఖ సబ్‌డివిజనల్ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ్‌రెడ్డి కుల వివక్షతో ఉద్యోగులను అవమానించిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. ఆ అధికారి పై వెంటనే చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నంద్యాల జిల్లా యూనిట్ డిమాండ్ చేసింది. బుధవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కె. నాగేంద్రప్ప, కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ రవీంద్రనాథ్‌రెడ్డి తన వద్ద పనిచేసే సబ్‌ఆర్డినేట్లు ఏ. లవ్‌కుమార్, కే. భరత్‌లను కులం పేరుతో దూషించి, మానసిక వేధింపులకు పాల్పడడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని అన్నారు. చెప్పులు బయట వదిలి లోపలికి రావాలని ఆదేశించడం అవమానమని మండిపడ్డారు. ఇలాంటి ప్రవర్తనకు అధికారం ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. వెంటనే రవీంద్రనాథ్‌రెడ్డిని సస్పెండ్ చేయాల్సిందిగా డిమాండ్ చేశారు. జిల్లా కోశాధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ ఉన్నతాధికారి హోదాలో కూర్చున్న వ్యక్తి కుల వివక్ష చూపించడం సిగ్గుచేటని, ప్రభుత్వం విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. భోజన విరామ సమయంలో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షురాలు ఆర్. విజయలక్ష్మి, నగర కోశాధికారి వెంకట చక్రధర్, సభ్యులు బుల్లెట్ భాష, నిర్మల, సుబ్బరత్నమ్మ, రషీద్, లక్ష్మణ్ నాయక్, ఆయేషా, సుమంత్, సుమన్, సుజాత, అనిత కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

# వరద ప్రభావిత పంట పొలాలను పరిశీలించిన కలెక్టర్





మనగళం, ఆళ్లగడ్డ/నంద్యాల: మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి బుధవారం పరిశీలించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గ పరిధిలోని పొలాలకు వెళ్లి ప్రత్యక్షంగా పరిశీలించారు. తొలుత ఆళ్లగడ్డ మండలంలోని కోటకందుకూరు గ్రామంలో రైతు ఎం.హిమాం హుస్సేన్ సాగు చేసిన ఉల్లి పంట పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. మూడు ఎకరాల్లో ఉల్లి పంట సాగు చేసానని, ఎకరాకు లక్ష రూపాయలు ఖర్చు చేశానని, వర్షాల కారణంగా పంట ప్రారంభ దశలోనే నీరు నిలిచిపోయి తీవ్ర నష్టం కలిగిందని రైతు ఆందోళన వ్యక్తం చేశారు. తదుపరి కలెక్టర్ మొక్కజొన్న పంట పొలాలను కూడా పరిశీలించారు. రైతులు ఎకరాకు సుమారు 50 వేల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ, ధాన్యం కోత అనంతరం వర్షాల వల్ల పంట నష్టపోయిందని వివరించారు. ప్రభుత్వం నుండి ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయించాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. రుద్రవరం మండలం ఆలమూరు గ్రామంలో రసూల్ బీ అనే రైతు సాగు చేసిన బొప్పాయి పంట పొలాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. దాదాపు 248 ఎకరాల్లో మూడు నుంచి నాలుగు నెలల బొప్పాయి చెట్లు నీటిలో మునిగి ఆకులు ఎండిపోయి, వేర్లు కుళ్లిపోయి పంట దెబ్బతిన్నట్లు రైతులు వివరించారు. మొత్తం 248 ఎకరాల్లో వేసిన పంటలో సుమారు 80 శాతం వరకు నష్టం జరిగిందని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తుపాను కారణంగా సంభవించిన పంట నష్టాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. నష్టపోయిన ప్రతి రైతుకు ప్రభుత్వ సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని రైతులకు భరోసా ఇచ్చారు. రైతులు పంట సంరక్షణలో మెలకువగా ఉండాలని, వాతావరణ మార్పులను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఆళ్లగడ్డ నుండి రుద్రవరం వరకు సర్వీస్ రోడ్డుపై రైతులు ఆరబెట్టిన మొక్కజొన్న దిగుబడులకు వర్షాల కారణంగా ఫంగస్ పట్టి వ్యాపారులు కొనడంలేదని రైతులు వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. పంట నష్ట అంచనాలను త్వరితగతిన లెక్కించాలనీ, సంబంధిత వ్యవసాయ మరియు ఉద్యాన శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, ఆళ్లగడ్డ వ్యవసాయ శాఖ ఏడీ విజయ శేఖర్, రుద్రవరం మరియు ఆళ్లగడ్డ మండల వ్యవసాయ అధికారులు, తహసీల్దారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# పాలకుల నిర్లక్ష్యంతోనే వరదల ముప్పు



మనగళం, నంద్యాల : గత, ప్రస్తుత పాలకుల నిర్లక్ష్యంతోనే నంద్యాల పట్టణానికి వరద ముప్పు తప్పడం లేదని సీపీఎం జిల్లా కార్యదర్శి టి రమేష్ కుమార్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, కార్యదర్శి వర్గ సభ్యులు పుల్లా నరసింహులు,కే మహమ్మద్ గౌస్, సీనియర్ నాయకుడు తోట మద్దులు ఆందోళన వ్యక్తం చేశారు. మొంతా తుపాను ప్రభావంతో జలమయమైన లోతట్టు ప్రాంతాలను బుధవారం సీపీఎం నాయకులు పరిశీలించారు. బయటి పేట, వైఎస్ఆర్ నగర్,శ్యామ్ నగర్, హరిజన పేట, విశ్వ నగర్, ఎన్జీవోస్ కాలనీ, సీపీఎం ఆఫీస్ ఏరియా, మంగలి పేట, చామకాలువ చుట్టూ ఉన్న ప్రాంతాలలో సీపీఎం నాయకులు పర్యటించారు. ప్రజల పడుతున్న ఇబ్బందులపై సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సీపీఎం 72 గంటల దీక్ష చేపట్టడం మూలంగా వరదలు అరికట్టేందుకు రూ.100 కోట్లు విడుదల చేసినా పాలకుల నిర్లక్ష్యం మూలంగా ప్రయోజనం చేకూరలేదని నాయకులు అసహనం వ్యక్తం చేశారు. చామకాలువ,కుందూ నది, మద్దిలేరు వాగుల వెంట రక్షణ గోడను నిర్మించకపోవడం వలన ప్రభుత్వం నిధులను వెనక్కి తీసుకుందని, ఇది పాలకుల నిర్లక్షం కాదా అని మండిపడ్డారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి వరదల ముప్పు రాకుండా చర్యలు తీసుకవాలని ఈ సందర్భంగా నాయకులు డిమాండ్ చేశారు.

# మత్తు పదార్థాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి

**- నంద్యాల జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్**

మనగళం, నంద్యాల : గంజాయి, గుట్కా తదితర మత్తు పదార్థాలను నియంత్రించేందుకు పోలీసులతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఉన్నత విద్యా, తదితర శాఖల అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో మత్తు పదార్థాల నియంత్రణ అమలుపై సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ రామునాయక్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి గంజాయి ఇతర మత్తు పదార్థాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైతే మత్తు పదార్థాలు లభ్యమవుతున్నాయో ఆయా ప్రదేశాలను గుర్తించి పకడ్బందీ చర్యలు తీసుకునేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కళాశాలల యాజమాన్య కమిటీలకు సూచించారు. ముఖ్యమైన కూడళ్లలో మాదక ద్రవ్యాల వినియోగ నియంత్రణకు సంబందించి హోర్డింగ్ లను ఏర్పాటు చేసి యువతపై మాదకద్రవ్యాల ప్రభావం పడకుండా చూడాలన్నారు. అడిషనల్ ఎస్పీ యోగేంద్ర బాబు మాట్లాడుతూ జిల్లా పోలీసు యంత్రాంగం తరపున మత్తు పదార్థాల నియంత్రణకు తమ వంతు బాధ్యతగా పనిచేస్తున్నామన్నారు. మత్తు పదార్థాల నియంత్రణకు సంబంధించి కళాశాలలో పాఠశాలలో ముఖ్యమైన కూడలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మానవత్వంతో ఆపదలో ఉన్న వారిని ఆదుకొని తమకు తోచిన సాయం చేయాలన్నారు. ప్రస్తుత సమాజంలో తల్లిదండ్రులు తమ పిల్లలు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలకు బానిస కాకుండా




కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మా కలం.. మీ గళం..
మన గళం
దిన పత్రిక

# వెల్వెట్ లెహంగాలో మతిపోగొట్టేస్తోన్న శ్రీలీల..



మన గళం, సినిమా : శ్రీలీల.. తెలుగు సినీప్రియులకు పరిచయం అక్కర్లేనిపేరు. తెలుగులో పెళ్లి సంద%ఁ% సినిమాతో కథానాయికగా ఎంట్రీ ఇచ్చిన ఈ ముద్దుగుమ్మ.. ఫస్ట్ మూవీతోనే అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ తర్వాత ధమాకా సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంది. ఈ మూవీ తర్వాత తెలుగులో శ్రీలీలకు వరుస ఆఫర్స్ క్యూ కట్టాయి. అయితే ధమాకా సినిమా తర్వాత అనేక ప్రాజెక్ట్స్ చేసినప్పటికీ ఆ స్థాయిలో హిట్టు మాత్రం రాలేదు. ఇటీవలే జూనియర్ సినిమాతో అడియన్స్ ముందుకు వచ్చింది. ఈ మూవీ కమర్షియల్ హిట్ కాలేదు. ఇక ఇప్పుడు మాస్ జాతర సినిమాతో అడియన్స్ ముందుకు వస్తుంది. ఇందులో రవితేజ హీరోగా నటిస్తున్న సంగతి తెలిసిందే. నవంబర్ 1న ఈ సినిమా విడుదల కాబోతుంది. ఈ క్రమంలోనే అక్టోబర్ 31న ఈ సినిమా ప్రీమియర్స్ షోలో స్టార్ట్ కానున్నాయి. ఈ సినిమా ప్రమోషనల్లో పాల్గొంటూ సందడి చేస్తుంది. ఈ క్రమంలోనే తాజాగా బ్లూ కలర్ వెల్వెట్ హాఫ్ సారీ ధరించి తన అందాలతో అందరి దృష్టిని ఆకట్టుకుంటుంది ఈ వయ్యారి.ముఖ్యంగా వెల్వెట్ బ్లూ కలర్ ఆఫ్ సారీలో శ్రీలీల మరింత అందంగా కనిపిస్తుంది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ షేర్ చేసిన ఫోటోస్ సోషల్ మీడియాలో తెగ వైరలవుతున్నాయి. మాస్ జాతర సినిమాతోపాటు శ్రీలీల అరుంధతి 2 చిత్రంలోనూ నటించనున్నట్లు టాక్. అలాగే తమిళంలో ఓ ప్రాజెక్ట్ చేస్తుందట. ఓవైపు తెలుగులో పవన్ కళ్యాణ్ జోడిగా ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటిస్తుంది.అలాగే హిందీలో కార్తీక్ ఆర్యన్ సరసన ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. ఇవే కాకుండా హిందీలో శ్రీలీలకు వరుస ప్రాజెక్ట్స్ వస్తున్నట్లు సమాచారం. మరోవైపు సోషల్ మీడియాలో నిత్యం గ్లామర్ ఫోటోషూట్స్ షేర్ చేస్తుంది.

# చైనా పీస్ నుంచి ఇదేంటో జేమ్స్‌బాండ్ సాంగ్ రిలీజ్




మన గళం, సినిమా : నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా చైనా పీస్. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌లో తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేశ్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ప్రజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో వచ్చిన టీజర్ ఈ సినిమాపై అంచనాలను క్రియేట్ చేసింది. ఈ క్రమంలో తాజాగా ఈ సినిమా నుంచి ఇదేంటో జేమ్స్‌బాండ్ సాంగ్‌ను రిలీజ్ చేశారు. కార్తిక్ రోడ్రిగ్జ్ ఈ సాంగ్‌ను ఎనర్జిటిక్‌గా కంపోజ్ చేశారు. స్ఫూర్తి జితేందర్, హారిక నారాయణ్ వోకల్స్ ఆకట్టుకున్నాయి. దినేశ్ కాకర్ల లిరిక్స్ కాన్సెప్ట్‌ను చాలా ఫన్‌ఫుల్‌గా ప్రజెంట్ చేశారు. ఈ సినిమా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రాబోతుంది.

# చిరంజీవి సినిమాలో నేను లేను..



మన గళం, సినిమా : మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

# హీరోయిన్‌గా మహేష్ బాబు మేనకోడలు..

## సంతోషం వ్యక్తం చేసిన మంజుల





మన గళం, సినిమా : ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసురాలు రాబోతోంది. ఆమె మరెవరో కాదు కృష్ణ మనవరాలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. త్వరలోనే సినీ రంగంలో అడుగుపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నటన, డాన్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జాన్వీ ఇప్పటికే కొన్ని కథలను విన్నట్టు సమాచారం. వాటిలో ఒక ప్రాజెక్ట్ కోసం అధికారిక ఒప్పందం కూడా పూర్తయిందని తెలుస్తుంది. త్వరలోనే ఆమె డెబ్యూ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక జాన్వీ తల్లి మంజుల ఘట్టమనేనికి హీరోయిన్ కావాలనే కోరిక ఉండేది. ఒకప్పుడు ఆమెను కథానాయికగా ప్రకటించినప్పటికీ, కృష్ణ అభిమానులు "ఆమెని మేము హీరోయిన్‌గా చూడలేం" అంటూ వ్యతిరేకించడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. తరువాత మంజుల నిర్మాతగా, కొన్నిసార్లు నటిగా, అలాగే దర్శకురాలిగా కూడా ఇండస్ట్రీలో తన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె సినిమాల నుంచి కొంత దూరంగా ఉన్నారు. ఇప్పుడు అదే ఇంటి నుంచి మరో తరం తెరపైకి రావడానికి సిద్ధమవుతుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. మరోవైపు కృష్ణ చిన్న కుమారుడు రమేష్ బాబు తనయుడు కూడా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు. దీంతో ఘట్టమనేని కుటుంబం నుంచి కొత్త తరం ఇండస్ట్రీకి వస్తుండడంపై ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అభిమానులు ఇప్పుడు మహేష్ బాబు పిల్లలు గౌతమ్, సితార ఎప్పుడు సినిమాల్లోకి వస్తారోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మహేష్ బాబు ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. అయితే మంజుల తన కుమార్తె హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. ఒకప్పుడు"నీవు హీరోయిన్‌గా ఎందుకు?"అని ప్రశ్నించినవారే ఇప్పుడు"నీ కుమార్తె సినిమాల్లో రావాలి"అని ప్రోత్సహిస్తున్నారని ఆమె చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన కుమార్తె చిరునవ్వే తన ప్రార్థనలకు సమాధానం అని మంజుల ఘట్టమనేని సంతోషంగా తెలియజేసింది.

# రష్మిక మందన్నా మైసా టీంతో ప్రభాస్ కల్కి 2898 ఏడీ స్టంట్ మాస్టర్

మన గళం, సినిమా : పుష్ప ఫ్రాంచైజీతో పాన్ ఇండియా స్థాయిలో సూపర్ స్టార్ డమ్ సంపాదించింది కన్నడ హీరోయిన్ రష్మిక మందన్నా. ఈ భామ లీడ్ రోల్‌లో నటిస్తున్న మరో పాన్ ఇండియా చిత్రం మైసా. ఈ మూవీకి సంబంధించిన ఆసక్తికర వార్త ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. %తాజా టాక్ ప్రకారం ఈ చిత్రానికి ప్రభాస్ కల్కి 2898 ఏడీ ప్రాజెక్ట్‌కు పనిచేసిన ఆండీ లాంగ్ గ్యుయెన్ స్టంట్ మాస్టర్‌గా పని చేస్తున్నాడు. అంతేకాదు యాక్షన్ బ్లాప్‌పై పనిచేసేందుకు ఇప్పటికే ఆండీ లాంగ్ గ్యుయెన్ టీం కేరళలో ల్యాండింగ్ కూడా అయినట్టు సమాచారం. షూటింగ్ కూడా త్వరలోనే మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడని తెలిసిందే. రష్మిక మందన్నా సినిమాలో తారక్ పొన్నప్ప నటించడం ఇది రెండోసారి. మైసా సినిమాతో డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. ఈ డెబ్యూ డైరెక్టర్ ఇటీవలే మైసా నుంచి రష్మిక మందన్నా అగ్రెసివ్ లుక్ విడుదల చేయగా.. గూస్‌బంప్స్ తెప్పించడం ఖాయమని చెప్పకనే చెబుతోంది. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ చిత్రానికి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. శ్రీవల్లిగా డీగ్లామరస్ రోల్‌లో ఇరగదీసిన రష్మిక మందన్నాను మరి కొత్త దర్శకుడు మైసా సినిమాలో ఎలా చూపించబోతున్నాడన్నది సర్వత్రా ఆసక్తి నెలకొంది.





# మహిళల ప్రపంచకప్ సెమీఫైనల్‌లో సఫారికా - ఇంగ్లాండ్ మధ్య తలపడి పోరు







మన గళం, అక్టోబర్ 29, 2025 : కేప్‌టౌన్ : మహిళల ప్రపంచకప్ క్రికెట్ టోర్నీలో ఈరోజు జరగబోయే తొలి సెమీఫైనల్ పోరు సఫారికా, ఇంగ్లాండ్ జట్ల మధ్య అత్యంత ఆసక్తికరంగా మారింది. గత మ్యాచ్‌లలో ఇంగ్లాండ్ చేత సఫారికా 69 పరుగుల తేడాతో పరాజయం పొందింది. ఆ ఓటమి మచ్చను తుడిచేయాలని సఫారికా జట్టు నిశ్చయించుకుంది. ఈ సీజన్‌లో సఫారికా జట్టు మంచి ఆటతీరు ప్రదర్శించింది. బౌలింగ్ విభాగంలో ఖయా మినీ, లారా వోల్వార్ట్‌ల ప్రదర్శన జట్టుకు బలం చేకూర్చింది. మరోవైపు ఇంగ్లాండ్ జట్టు కూడా చక్కటి ఫామ్‌లో ఉంది. టాప్ ఆర్డర్‌లో నైట్, సివర్-బ్రంట్ వంటి ఆటగాళ్లు స్థిరమైన ఆటతీరుతో జట్టుకు శక్తినిస్తున్నారు. మ్యాచ్ జరగబోయే వేదిక కేప్‌టౌన్ మైదానం కావడంతో, స్థానిక అభిమానులు తమ జట్టుకు మద్దతుగా పెద్ద సంఖ్యలో చేరుతున్నారు. వాతావరణం ఆడటానికి అనుకూలంగా ఉండడంతో ఉత్కంఠ భరితమైన పోటీ జరిగే అవకాశం ఉంది. సఫారికా జట్టు ఆటగాళ్లు ఈసారి తమ పిచ్ పరిజ్ఞానం, స్థానిక పరిస్థితులను ఉపయోగించుకొని ప్రతీకారం తీర్చుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ఇంగ్లాండ్ జట్టు తన గత విజయ శకలాన్ని కొనసాగించాలని చూస్తోంది. ఈ పోరులో విజయం సాధించిన జట్టు ఫైనల్‌కు ప్రవేశిస్తుంది. ఈ సెమీఫైనల్ ద్వారా మహిళల క్రికెట్ అభిమానులు మరొక అద్భుతమైన పోరును వీక్షించబోతున్నారు.

# లామెలో బాల్ తిరిగి ఫిట్‌గా బరిలోకి దిగుతున్నాడు




మన గళం,అక్టోబర్ 29, 2025 : మియామి : అమెరికా ప్రొఫెషనల్ బాస్కెట్‌బాల్ లీగ్‌లో చార్లెట్ హార్నెట్స్ జట్టు స్టార్ ఆటగాడు లామెలో బాల్ తిరిగి మైదానంలోకి అడుగుపెట్టబోతున్నాడు. కొన్ని వారాల క్రితం నడుము గాయం కారణంగా ఆడలేకపోయిన అతను, పూర్తిగా కోలుకున్నట్లు జట్టు వైద్యులు ధృవీకరించారు. ఈరోజు మియామి హీట్ జట్టుతో జరగబోయే మ్యాచ్‌లో బాల్ పాల్గొననున్నాడు. లామెలో బాల్ తిరిగి రావడంతో జట్టులో ఉత్సాహం నెలకొంది. అతని చురుకైన ఆటతీరు, దూకుడు దాడులు, వేగవంతమైన పాస్‌లు జట్టుకు మళ్లీ పాత బలం తెచ్చిపెడతాయని అభిమానులు ఆశిస్తున్నారు. గత సీజన్‌లో అతను అనేక కీలక మ్యాచ్‌లలో జట్టును విజయతీరాలకు చేర్చాడు. చార్లెట్ హార్నెట్స్ ఈ సీజన్‌లో ఇప్పటివరకు కొంత వెనుకబడి ఉన్నా, బాల్ తిరిగి రావడంతో విజయ పథంలో నడుస్తారని జట్టు కోచ్ తెలిపారు. మియామి హీట్ బలమైన ప్రత్యర్థి అయినా, లామెలో ఫిట్‌గా ఉన్నప్పటి ఆటతీరుతో హార్నెట్స్ గెలుపు అవకాశాలు పెరిగాయి. బాల్ స్వయంగా తన గాయానంతరం చేసిన ప్రాక్టీస్ సెషన్లలో బలంగా కనిపించాడు. అభిమానులు ఈ పోటీలో అతని పునరాగమన ప్రదర్శనను ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# భారత్ - ఆస్ట్రేలియా తొలి టీ20 పోరు: ప్రపంచకప్‌కు ముందరి తాత్కాలిక పరీక్ష

మన గళం, అక్టోబర్ 29, 2025 : కేన్బెరా : భారత్ మరియు ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తొలి పోరు ఈరోజు కేన్బెరాలోని మానుకా ఓవల్ మైదానంలో ప్రారంభమవుతోంది. రాబోయే టీ20 ప్రపంచకప్‌కు ఇది ప్రధానంగా సన్నాహక సిరీస్‌గా భావిస్తున్నారు. యువ ఆటగాళ్లకు అవకాశం ఇస్తూ భారత జట్టు కొత్త కాంబినేషన్‌లను పరీక్షించబోతోంది. భారత జట్టుకు సూర్యకుమార్ యాదవ్ నాయకత్వం వహిస్తుండగా, అబిషేక్ శర్మ, రుతురాజ్ గైక్వాడ్, రియాన్ పరాగ్ వంటి యువ ఆటగాళ్లు కీలక పాత్ర పోషించనున్నారు. ఆస్ట్రేలియా జట్టులో కూడా ప్యాట్ కమ్మిన్స్ నేతృత్వంలో కొత్త క్రీడాకారుల్ని పరిశీలిస్తున్నారు. రెండు జట్లు కూడా ఫీల్డింగ్, బౌలింగ్ విభాగాల్లో కొత్త వ్యూహాలను ఉపయోగించేందుకు సిద్ధమయ్యాయి. పిచ్ బౌన్సీగా ఉండటం వల్ల ఫాస్ట్ బౌలర్లకు మేలు కలగొచ్చు. మరోవైపు స్పిన్ బౌలర్లు మధ్య ఓవర్లలో మైదానాన్ని ఉపయోగించుకునే అవకాశం ఉంది. వాతావరణం ఆడటానికి అనుకూలంగా ఉండటంతో హై స్కోరింగ్ మ్యాచ్‌కి అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఈ సిరీస్ ఫలితం పెద్దగా ప్రాముఖ్యం కలిగించకపోయినా, భవిష్యత్తు జట్టు సమీకరణలు నిర్ణయించడంలో




కీలకపాత్ర పోషించనుంది. భారత జట్టు కోసం యువత ప్రదర్శన ఎలా ఉంటుందో అభిమానులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు.

# ఆస్ట్రేలియా పిచ్‌లలో సూర్యకుమార్ యాదవ్‌కు కొత్త అవకాశాలు

మన గళం, అక్టోబర్ 296, 2025 : మెల్‌బోర్న్ : భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ఈ సిరీస్‌లో కీలకమైన దశను ఎదుర్కొంటున్నాడు. ఆస్ట్రేలియాలో జరుగుతున్న టీ20 సిరీస్‌లోని పిచ్‌లు ఆయనకు తన ఫామ్ తిరిగి పొందే ఉత్తమ అవకాశం కలిగిస్తాయని మాజీ భారత క్రికెటర్ ఇర్ఫాన్ పఠాన్ అభిప్రాయపడ్డారు. ఇర్ఫాన్ మాట్లాడుతూ, “సూర్యకుమార్ బౌన్సీ పిచ్‌లపై బలంగా ఆడగలడు. షార్ట్ బంతులను ఎదుర్కోవడంలో అతనికి సాంకేతికంగా మంచి నైపుణ్యం ఉంది. ఈ సిరీస్‌లో అతను పెద్ద ఇన్నింగ్స్ ఆడే అవకాశం ఉంది” అని పేర్కొన్నారు.గత కొంతకాలంగా సూర్యకుమార్ ఆటతీరు అస్థిరంగా ఉందన్న విమర్శలు వస్తున్నాయి. వరుసగా మూడు సిరీస్‌లలో పెద్ద స్కోర్లు సాధించలేకపోయిన ఆయనపై ఒత్తిడి పెరిగింది. అయితే ఆస్ట్రేలియా పిచ్‌ల స్వభావం ఆయనకు దూకుడు ఆటతీరును ప్రదర్శించే అవకాశం ఇవ్వొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. భారత జట్టు కూడా ఈ సిరీస్‌లో కొత్త కాంబినేషన్‌లను పరీక్షించనుండటంతో, సూర్యకుమార్ బ్యాటింగ్



స్థానంలో మార్పులు ఉండొచ్చని సమాచారం. అభిమానులు ఆయన ఈ సిరీస్‌లో తిరిగి తన పాత మాంత్రిక ఫామ్ చూపిస్తాడని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# జాతీయ జట్టులోకి తిరిగి దారి చూసే షార్దుల్ ఠాకూర్



మన గళం, అక్టోబర్ 29, 2025 : ముంబై : భారత క్రికెట్ ఆల్‌రౌండర్ షార్దుల్ ఠాకూర్ మరోసారి జాతీయ జట్టులో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో కఠిన సాధనలో నిమగ్నమయ్యాడు. ఇటీవల జరిగిన దేశీయ టోర్నీల్లో ఆయన చూపించిన ప్రదర్శన ఎంపికదారుల దృష్టిని ఆకర్షిస్తోంది. గాయాలు, ఫామ్ లోపం కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైనా, ఇప్పుడు మళ్లీ తన ప్రతిభను నిరూపించేందుకు సిద్ధమవుతున్నాడు. ఠాకూర్ మాట్లాడుతూ, తన లక్ష్యం 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత్ తరఫున మళ్లీ ఆడడమేనని చెప్పాడు. దానికి తగిన విధంగా ఫిట్‌నెస్, బౌలింగ్, బ్యాటింగ్ అంశాలపై సమాన దృష్టి పెడుతున్నానని వివరించాడు. ఆల్‌రౌండర్‌గా జట్టుకు సమతుల్యత తీసుకురావగలననే నమ్మకంతో ఉన్నానని ఆయన చెప్పాడు. ముంబై జట్టుతో ప్రాక్టీస్ సెషన్లలో షార్దుల్ బౌలింగ్ వేగం, లైన్-లెంగ్త్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాడు. అతని అద్భుత ప్రదర్శన రంజీ ట్రోఫీ సీజన్‌లో స్పష్టంగా కనిపించింది. క్రమశిక్షణతో కూడిన ఆటతీరు కొనసాగిస్తే, రాబోయే అంతర్జాతీయ సిరీస్‌లలో ఆయనకు అవకాశం లభించే అవకాశం ఉందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడ్డారు. జట్టు సమీకరణలో ఆల్‌రౌండర్ పాత్రకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఉండే ఈ సమయంలో, షార్దుల్ వంటి ఆటగాళ్లు తిరిగి ఫామ్‌లోకి రావడం భారత క్రికెట్‌కు శు భపరిణామంగా భావిస్తున్నార.




# తెలంగాణ కబడ్డీ జట్టు జాతీయ కప్ ఫైనల్‌లోకి దూసుకెళ్లింది

మన గళం, అక్టోబర్ 29, 2025 : పుణే : పుణేలో జరుగుతున్న జాతీయ కబడ్డీ కప్‌లో తెలంగాణ జట్టు అద్భుత ప్రదర్శనతో ఫైనల్ బరిలోకి ప్రవేశించింది. సెమీఫైనల్‌లో తమిళనాడును 42%-%33 తేడాతో ఓడించి ఈ ఘనత సాధించింది. మ్యాచ్ ఆరంభం నుంచే తెలంగాణ ఆటగాళ్లు దూకుడు ప్రదర్శన కనబరిచారు. కెప్టెన్ ప్రణయ్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టుకు ఆధిక్యం తీసుకొచ్చాడు. రైడర్ రమేష్, డిఫెండర్ వినోద్ కీలక సమయాల్లో ప్రత్యర్థులను ఔట్ చేస్తూ జట్టు విజయానికి దోహదం చేశారు. చివరి నిమిషాల్లో తమిళనాడు తిరిగి పోరాడినా, తెలంగాణ రక్షణ ఘనంగా నిలిచింది. ఫైనల్‌లో తెలంగాణ జట్టు మహారాష్ట్రను ఎదుర్కోనుంది. కబడ్డీ అసోసియేషన్ అధికారి మాట్లాడుతూ, “ఇది తెలంగాణ జట్టుకు గర్వకారణమైన విజయం. ఈ సీజన్‌లో వారు క్రమశిక్షణతో ఆడి కొత్త రికార్డు సృష్టించారు” అని



తెలిపారు. రేపు ఫైనల్ పోరు జరగనుండగా, రాష్ట్ర వ్యాప్తంగా అభిమానులు జట్టుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

Editor, Printed, Published and Owned by S. T. KHALEEL BASHA. H.NO. 46-156-E2, BUDHAVAR PETA, KURNOOL DIST. A.P. - 518004.
PRINTED AT G.K PUBLICATIONS, BANDIMETTA STREET, KURNOOL DIST. AP- 518004, RNI : APTEL/ 2017/74310